'ఇందిరమ్మ'లో అధికారుల లీలలు..! 2






నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**అక్షరటుడే, కమ్మర్ పల్లి:** కమ్మర్‌పల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్మూర్ డివిజన్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయంలోని రికార్డ్ రూంను పరిశీలించి తహశీల్దార్ ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు.





## ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద ఉధృతి..

**అక్షరటుడే, మెండోరా:** ఎస్సారెస్పీలోకి ఎగువ నుండి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఉదయం 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు వరద తగ్గడంతో 11 గంటల ప్రాంతంలో 8 గేట్లు మాత్రమే ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1091 అడుగులకు (80.051 టీఎంసీలు) చేరింది. జలాశయంలో నిల్వలు పూర్తిస్థాయికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 34,790 క్యూసెక్కులు వస్తున్న నేపథ్యంలో.. అంతేమొత్తంలో 34,790 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు నుండి వివిధ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు.

### నిజాంసాగర్ ప్రాజెక్టులోకి..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 34,604 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 2 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్‌కు వరద వస్తుండడంతో వరద గేట్ల ద్వారా 13,562 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. అంతే మొత్తంలో 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. కాగా ఎగువన సింగూరు నుంచి ప్రవాహం తగ్గింది. దీంతో దిగువకు నీటి విడుదలను అధికారులు తగ్గించారు. ఫలితంగా నిజాంసాగర్‌కు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గే అవకాశం ఉంది. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి 832 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి 27.948 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి: సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగర శివారులోని జానకంపేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సౌకర్యాలను మెరుగుపర్చాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం సీపీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. సెంటర్‌లోని సౌకర్యాలను సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణ కేంద్రం అనేది భవిష్యత్ పోలీస్ అధికారుల శైలిని తీర్చిదిద్దేదన్నారు. ఇక్కడ శిక్షణ పొందేవారికి శారీరక, మానసిక అభివృద్ధి జరిగేలా వాతావరణం కల్పించాలని అక్కడి అధికారులను ఆదేశించారు. సెంటర్‌లో తగిన వసతులు, శిక్షణా పరికరాలు, శిక్షకులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సెంటర్‌లో వసతులు, ట్రైనింగ్ సెంటర్ గదులు, వంటశాల, నీటి సరఫరా, శౌచాలయాలు, ఇండోర్ తరగతి గదులు, అవుట్ డోర్ పరేడ్ గ్రౌండ్, ఫైరింగ్ రేంజ్ తదితర అంశాలను పరిశీలించారు. మరమ్మతులు అవసరం ఉంటే తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై రమ, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది తదితరులున్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీలు, పదోన్నతులు చేపట్టింది. అలాగే పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటును చేసింది. కానీ జిల్లాలో ఇప్పటికీ కొన్ని బడుల్లో విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు లేరు.. ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు లేని పరిస్థితి నెలకొంది.

- అక్షరటుడే, ఇందూరు




# బడులపై పట్టింపేది!

▸ పిల్లలు లేని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ▸ టీచర్ల సర్దుబాటులో పైరవీలు ▸ పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సర్దుబాటు ప్రక్రియను మొదలుపెట్టింది. కానీ కొందరు ఉపాధ్యాయులు తమ స్వలాభం కోసం ఉన్నచోటు నుంచి కదలకుండా పైరవీలు చేసుకున్నారు. విద్యార్థులు లేకున్నా.. ఆయా పాఠశాలల్లోనే కొనసాగుతున్నారు. ఇందుకు అధికారులు సహకరించడంతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### సర్దుబాటు చేసినా..

జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. అలాగే పలు బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థులు లేని పాఠశాలల నుంచి అవసరం ఉన్న చోటకు టీచర్లను సర్దుబాటు చేశారు. పలువురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు. కానీ జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న మండలాల్లో కొందరు ఉపాధ్యాయులు అక్కడి నుంచి కదలడం లేదు. ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా మోపాల్‌తో పాటు చుట్ట పక్కల మండలాల పలు ప్రాథమిక పాఠశాల్లో ఈ పరిస్థితి నెలకొంది. విద్యార్థులు లేక కొన్ని బడులు మూత పడిపోగా.. మరికొన్ని పాఠశాలల్లో పదిలోపు విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉండడం గమనార్హం. చాలా పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడే పరిస్థితి నెలకొంది. అయితే విద్యార్థుల సంఖ్యను పెంచడమో లేక పాఠశాలలను విలీనం చేసి అవసరమున్న చోట్లకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

### మచ్చుకు కొన్ని..

- అమ్రాబాద్ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.
- కస్బాగ్ తండాలో నలుగురు విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.
- ఎల్లమ్మ కుంట పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు.
- బైరాపూర్‌లో 12 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు.
- హనుమాన్ తండాలో ఎనిమిది మంది విద్యార్థులకు ఒకటి టీచర్ ఉన్నారు.

### విద్యార్థులు ఎంతమంది ఉన్నా బడి నడవాల్సిందే..

విద్యార్థులు ఎంతమంది ఉన్నా పాఠశాలలను నడపాల్సిందేనని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. తక్కువమంది విద్యార్థులకు ఎక్కువమంది ఉపాధ్యాయులు ఉంటే వర్క్ అడ్జస్ట్మెంట్ చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో సర్దుబాటు చేస్తున్నాం. మోపాల్ మండలంలో పరిస్థితిని ఎంఈఓతో మాట్లాడి వర్క్ అడ్జస్ట్మెంట్ చేపడతాం.

- అశోక్, డీఈవో



## విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బీబీపేట్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, సిబ్బంది బ్యారక్ పరిశీలించి, శుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రోల్‌కాల్‌ను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకున్నారు. మానవ వనరుల సమర్థ వినియోగం, రోల్ కాల్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దర్యాప్తు ప్రక్రియలో కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి కేసును నిజాయితీతో, నైపుణ్యంతో, సమగ్రంగా విచారించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉందన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులపై వేగంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవడం ద్వారా మెరుగైన పోలీసింగ్ సాధ్యమవుతుందని తెలిపారు. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద చర్యలపై వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అనుమానితుల ప్రతి కదలికపై నిఘా పెట్టాలని, నేరాల అదుపునకు పటిష్టమైన గస్తీ-పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, వీపీవోలు తమకు కేటాయించిన గ్రామాలను తరచూ సందర్శిస్తూ, సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా భావిస్తూ విధుల్లో నిబద్ధత చూపాలన్నారు. డయల్ 100 ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా, సమర్థవంతంగా స్పందించాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఎస్పీ వెంట కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎస్సై ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.






## ప్రజావాణికి 88 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 88 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌తో పాటు డీఆర్డీవో సాయాగౌడ్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.



## జూబ్లీహిల్స్‌లో జీవన్‌రెడ్డి ప్రచారం

**అక్షరటుడే, ఆర్మూర్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సోమవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్‌కు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్ పేట్ డివిజన్ పరిధిలోని పారామౌంట్ గేట్ నెంబర్ 1లో ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి సునీత గోపినాథ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తూ షేక్ పేట్ డివిజన్ పరిధిలోని 20, 21, 22, 40, 41, 42 బూత్‌లో ప్రచారం నిర్వహించారు.



## 17 నుంచి జాతీయ పోషణ మాసోత్సవాలు

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ పోషణ మాసోత్సవాలు ఈనెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం మాసోత్సవాలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోషకాహారంతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిఒక్కరూ పోషక విలువ ఉన్న పదార్థాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, జిల్లా సంక్షేమ అధికారిని రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.






## కార్యకర్తల సూచన మేరకే డీసీసీ అధ్యక్షుడి నియామకం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మెజారిటీ కార్యకర్తల సూచన మేరకే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి నియామకం ఉంటుందని ఏఐసీసీ పరిశీలకులు రిజ్వాన్ హర్షద్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాను మొత్తం 11 బ్లాక్‌లుగా విభజించడం జరిగిందని, జిల్లాలోని ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను కలుపుకొని రాబోయే ఎనిమిది రోజులపాటు అన్ని బ్లాక్‌లలో పర్యటించడం జరుగుతుందన్నారు. ఐదేళ్లపాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నవారు ఎవరైనా డీసీసీ అధ్యక్షుడిగా పోటీ చేయవచ్చన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం వచ్చిన దరఖాస్తులను స్వీకరించిన అనంతరం కార్యకర్తల అభిప్రాయం మేరకే నియామకం ఉంటుందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రతీ కార్యకర్తను, మండల కమిటీ నాయకులను తాను ప్రత్యక్షంగా కలవనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆరేపల్లి మోహన్, అరికెల నర్సారెడ్డి, తాహెర్ బీన్ హందాన్, కేశ వేణు, ఏనుగు రవీందర్ రెడ్డి, అంతిరెడ్డి రాజారెడ్డి, గడుగు గంగాధర్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

### సమన్వయంతో ముందుకు సాగుతాం

**అక్షరటుడే, కామారెడ్డి:** డీసీసీ అధ్యక్షుడి నియామకంలో అందరి సమన్వయంతోనే ముందుకు సాగుతామని ఏఐసీసీ పరిశీలకులు రాజ్‌పాల్ కరోరా తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలో పాత, కొత్త తేడా లేకుండా అందరిని కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడి నియామకంలో కార్యకర్తల అభిప్రాయమే ఫైనల్ అని తేల్చి చెప్పారు. వారి నిర్ణయం మేరకే అధ్యక్షుడి నియామకం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీలో ఏమైనా లోపాలుంటే హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడి కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను పరిశీలనకు పంపిస్తామని పేర్కొన్నారు. అధ్యక్షుడి నియామకంలో రికమండేషన్లు ఉండవని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఇలియాజ్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## పశువైద్యులు అందుబాటులో ఉండట్లేదని పాడిరైతుల ఆందోళన


**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ పశు వైద్యశాలలో డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని పాడి రైతులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాల ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. వెంటనే పశువైద్యశాలలో డాక్టర్లు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో డాక్టర్లు అందుబాటులో లేక ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఉచితంగా పంపిణీ చేయాల్సిన మందులను ఆస్పత్రి సిబ్బంది ఇవ్వడం లేదని ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి పశు వైద్యశాలలో వైద్యులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



## బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో బెస్ట్ అవైలబుల్ కింద అభ్యసిస్తున్న విద్యార్థులకు నిధులను వెంటనే విడుదల చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం కార్పొరేట్ పాఠశాలలో ప్రవేశ పెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కీం నీరుగారిపోతుందన్నారు. గత మూడేళ్లుగా నిధులు లేక పాఠశాలల యాజమాన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. దసరా సెలవుల తర్వాత తమ పిల్లలను పాఠశాలలకు అనుమతించలేదని వాపోయారు. కార్యక్రమంలో బెస్ట్ అవైలబుల్ స్కీం పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, పాల్గొన్నారు.




## కలెక్టరేట్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను వెంటనే విడుదల చేయాలని బోధన్ జేఏసీ నాయకులు నవాతే ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 300 స్కూళ్లలో బెస్ట్ అవైలబుల్ స్కీం అమలు అవుతోందన్నారు. సుమారు రూ.250 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ఆయా స్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులను రానివ్వడం లేదని వివరించారు. ఈ కారణంగా ఎంతోమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవర్ల నాగరాజు, రాజన్న, ఆర్ గౌతం కుమార్, సంజయ్, మోసిన్, బాలరాజ్, ప్రశాంత్, శ్రీకాంత్, మోహన్, కిరణ్, సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 15న నెట్‌బాల్ ఎంపిక పోటీలు

**అక్షరటుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న నెట్ బాల్ అండర్-19 బాలబాలిక ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఎంపికలు సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇతర వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ కృష్ణంరాజును సంప్రదించాలని పేర్కొన్నారు.

## న్యూసెన్స్ కేసులో ఆరుగురు మహిళలకు జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో రాత్రివేళల్లో న్యూసెన్స్ చేస్తున్న ఆరుగురు మహిళలకు న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో యువతను ఆకర్షించేలా వ్యవహరిస్తూ.. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తున్న ఆరుగురు మహిళలను పోలీసులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్, కామారెడ్డి, భైంసా ప్రాంతాలకు చెందిన ఆరుగురు మహిళలపై సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని సోమవారం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఒకరికి ఒకరోజు, మిగిలినవారికి రెండురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. ఎవరైనా న్యూసెన్స్ చేస్తూ శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే.. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

## దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

**అక్షరటుడే, మెండోరా:** దీపం అంటుకుని ఓ ఇంటికి నిప్పంటుకుంది. ఈ ఘటన మెండోరాలో సోమవారం చోటు చేసుకుంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజారాం ఇంట్లో ఆయన భార్య భార్గవి ఉదయం ఇంట్లో దీపం వెలిగించింది. అనంతరం పనుల నిమిత్తం వారు బయటకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు దీపం కారణంగా ఇంటికి మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో పొగలు రావడంతో గమనించిన గ్రామస్థులు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే టీవీ, ఫ్రిజ్, బియ్యం బస్తాలు, రూ.15వేల నగదు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ సందర్భంగా బాధితులకు 15 కిలోల రేషన్ బియ్యం అందించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** చేపల వేటకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ చోటు చేసుకుంది. మల్కాపూర్ గ్రామానికి చెందిన కొండ సంగయ్య (52) ఆదివారం చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా.. ఆయన వాడే తెప్ప నీటిలో తేలియాడుతూ కనిపించింది. దీంతో నీటిలో గాలించగా.. ఆయన మృతదేహం లభ్యమైంది. తెప్ప మీద నుంచి నీటిలో పడి, కాళ్లకు వల చుట్టుకోవడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సంగయ్య భార్య సాయవ్వ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

**బాన్సువాడ మండలం ఇబ్రహీంపేటకు చెందిన అనూషవ్వకు ఇందిరమ్మ పథకం కింద సొంతిల్లు మంజూరైంది. ఈ మేరకు ఆమె ఇంటి నిర్మాణ పనులు కూడా చేప ట్టింది. గోడల వరకు ఇంటి నిర్మాణం పూర్తి కాగా, ఇప్పటి వరకు బిల్లు మంజూరు కాలే దు. అధికారులను అడిగితే, అప్పటికే బిల్లు మంజూరైనట్లు అధికారులు రికార్డుల్లో చూపెట్టడంతో అవాక్కయ్యింది. తాను ఇప్పటికీ గుడిసెలోనే ఉంటున్నానని, బిల్లు రాలేదని వాపోయింది.**
– అక్షరటుడే, బాన్సువాడ



# ‘ఇందిరమ్మ’లో అధికారుల లీలలు..!

**▸ ఇళ్లు నిర్మించకపోయినా బిల్లులు ఇచ్చినట్లు రికార్డులు ▸ ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు**

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు దరఖాస్తులు పరిశీలిస్తుండగా, ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో 11,621 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 6,063 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో 2,663 ఇళ్లు బేస్‌మెంట్ వరకు, 736 గోడల వరకు, 306 స్లాబ్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. ఇప్పటి వరకు లబ్ధిదారులకు రూ.43.21 కోట్ల బిల్లులు చెల్లించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పరిశీలనలో చాలా వరకు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. బీర్కూర్ మండలం సాంబాపూర్ గ్రామంలో నునావత్ పాండు నాయక్ ఇంటిని నిర్మించకపోయినా.. రూ.40 వేలు బాకీ ఉన్నట్లు అధికారులు చూపిస్తున్నారు. బాన్సువాడ, బీర్కూర్, వర్ని, నస్రుల్లాబాద్, కోటగిరి తదితర మండలాల్లో ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇళ్లు లేని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాము ఇల్లు నిర్మించుకోలేదని, బిల్లులు ఎప్పుడూ పొందలేదని వాపోతున్నారు.

### ఏం జరిగిందంటే..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి వందల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. పునాది వరకు ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.5 వేల చొప్పున ఇచ్చారు. తర్వాత దశల వారీగా రూ.21 వేల నుంచి రూ.75 వేల వరకు చెల్లించారు. కానీ ఆ కాలంలో చాలా గ్రామాల్లో దళారులు అధికారులతో కుమ్మక్కై భారీ మోసాలకు పాల్పడ్డారు. లబ్ధిదారుల పేర్లతో నకిలీ బిల్లులు రూపొందించి నిధులను విత్‌డ్రా చేశారు. అప్పుడు దళారులు చేసిన అక్రమాలు ఇప్పుడు నిజమైన పేదల జీవితాల్లో శాపంగా మారాయి. రికార్డుల్లో ఇప్పటికే బిల్లులు తీసుకున్నట్లు చూపడంతో, ప్రస్తుతం వారు మళ్లీ ఇల్లు పొందే అవకాశం లేకుండా పోయింది.

### ఇల్లు కట్టుకోలేదు..



గతంలో ఇల్లు కట్టుకోలేదు, కానీ బిల్లులు ఎవరో తీసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరైంది. గోడల వరకు ఇంటిని నిర్మించుకున్నాం. మా అమ్మ పేరుమీద బాకీ ఉన్నట్లు చూపిస్తున్నారు.
– కాశీరాం, ఇబ్రహీంపేట్




## సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** సైబర్ నేరాలపై మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌లో ఖాతాదారులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి ఎస్సై-2 మాట్లాడుతూ సుమన రెడ్డి మాట్లాడుతూ.. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని పేర్కొన్నారు. అపరిచితులు అడిగితే ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఎలాంటి సమాచారం కూడా తెలియని వ్యక్తులకు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో బీవోబీ మేనేజర్ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ ఊషన్న తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం డీకంపల్లి రామస్వామి క్యాంప్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ రమేశ్, ఎంపీడీవో గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల కష్టానికి తగిన న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సూచించారు. అలాగే రైతులు తేమ శాతం, బస్తాల కొరత, తూకాల సమస్యలపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐకేపీ సిబ్బంది పర్యవేక్షణలో పారదర్శకంగా కొనుగోలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, మండల సమాఖ్య ఏపీఎం ఉమా కిరణ్, సీసీ రాజారమేశ్, సీఏ అనిత, సమాఖ్య అధ్యక్షులు మాధురి, రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

**అక్షరటుడే, నవీపేట్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బినోలా సొసైటీ మాజీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యంచ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవీపేట్ మండలంలోని తొమ్మిది గ్రామాల్లో గోదావరి వరద కారణంగా సుమారు 4వేల ఎకరాల్లో పంట మొత్తం మునిగిపోయిందన్నారు. పంట పూర్తిగా కుళ్లిపోవడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. అయితే పంటనష్టం వివరాలను రెండు వారాల క్రితం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి, స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రాల ద్వారా అందజేశామని వివరించారు. కానీ కనికరం లేని ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని వాపోయారు. దీంతో విసిగిపోయిన తాము యంచ రహదారిపై మహాధర్నా చేపట్టామని వివరించారు. నష్టపోయిన రైతులకు వెంటనే ఎకరానికి




రూ.50వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లాలోని రైతులందరినీ ఏకంచేసి పెద్ద ఎత్తున ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తొమ్మిది గ్రామాల రైతులతో పాటు అన్ని రాజకీయ పార్టీ నాయకులు, పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సరీన్, శ్రీకాంత్, కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ రావు, సంజీవ్, లాలు, ప్రవీణ్, కృష్ణ, పోశెట్టి, అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వడ్లకు బోనస్ చెల్లించాలి

**అక్షరటుడే, కోటగిరి:** కాంగ్రెస్ ప్రభుత్వం గత సీజన్‌లో ఇచ్చి హామీ మేరకు సన్నరకం వడ్లకు బోనస్ చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పోతంగల్ మండల కేంద్రంలో వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం.. గత రబీ సీజన్‌లో రైతులకు ఇస్తామని ప్రకటించిన రూ.500 బోనస్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల డిక్లరేషన్‌లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చని పరిస్థితి నెలకొని ఉందని రైతులు పేర్కొన్నారు. ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం చెల్లించి, దెబ్బతిన్న వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని.. ధాన్యానికి తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కిలోల తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా డీటీ అజీజ్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు.



సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. అనంతరం రైతులంతా కలిసి డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు, కల్లూరి హన్మాండ్లు (బజరంగ్) ప్రకాశ్ పటేల్, పబ్బా శేఖర్, గంగాధర్ పటేల్, సుబ్బు, రాజు పటేల్, వెంకటి, రాజు, మారుతి, మక్కయ్య, నాగనాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ :** మండలంలోని జలాల్‌పూర్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.39వేల విలువైన చెక్కులను బాధిత కుటుంబీకులకు అందించినట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన రాటం మంజులకు రూ.12వేలు, న్యాంతాబాద్ యువరాజ్‌కు రూ.12వేలు, దామ భోజన్నకు రూ.15వేల చెక్కులు మంజూరైనట్లు పేర్కొన్నారు. చెక్కులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, సహకరించిన మానాల మోహన్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ రాటం సాగర్, సంజీవరెడ్డి, రంజిత్ కుమార్, నవీన్, దేవేందర్ రెడ్డి, నళినీకాంత్, గణేష్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.



## నాగపూర్‌లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

**అక్షరటుడే, బాల్కొండ:** ప్రాథమిక విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించిందని బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం బాల్కొండ మండలంలోని నాగపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రీ ప్రైమరీ పాఠశాలకు ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టు మంజూరు చేసిందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్, మధ్యాహ్నం పిల్లలు నిద్ర పోయేందుకు పాఠశాలలోనే ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ నగర్ కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణ వేణి, హెచ్ఎం రవికుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## రహదారిపై మరమ్మతులు పూర్తిచేయాలి

**అక్షరటుడే, వర్ని:** బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు వెళ్లే రహదారిపై కొన్నినెలలుగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం మోస్రా మండల కేంద్రంలో రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఆర్నెళ్ల క్రితం రహదారి మరమ్మతులు ప్రారంభించి నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టర్ కారణంగా ఇప్పటికే అనేకమంది రహదారిపై గాయాలపడ్డారని వారు వాపోయారు. రాబోయే వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తిచేయకుంటే పెద్దఎత్తున నిరసనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి హన్మాగౌడ్, ఉపసర్పంచ్ సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ రాజ్ రెడ్డి, సాయిలు, లింగం, శ్రీహరి, యోగి శ్రీను, అనిల్, లక్ష్మీనారాయణ, నవీన్ రెడ్డి, నర్సారెడ్డి పిట్ల శేఖర్, శేఖర్ గౌడ్, రాజారెడ్డి, యశోద మధు, రవీందర్ గౌడ్, నరేందర్, బీజేపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.